# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 06 జూలై 2025 | www.balagamtv.com | పేజీలు 4




డెంగ్యూ, ప్లేట్‌లెట్స్ పేరుతో

## దోపిడీకి పాల్పడితే కఠిన చర్యలు

ప్రయివేటు ఆస్పత్రులకు మంత్రి దామోదర హెచ్చరిక వివరాలు 4వ పేజీలో

బాలికలు, మహిళల

# రక్షణకు అత్యంత ప్రాధాన్యత



- బాలల రక్షణపై రాష్ట్ర ప్రభుత్వ కట్టుబాటు స్పష్టం
- పోక్సో, జువెనైల్ చట్టాల అమలులో సమస్యలను అధిగమించాలి
- భరోసా కేంద్రాలు -చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టులు తెలంగాణ గర్వకారణం
- బాధితులకు న్యాయం మాత్రమే కాదు, భరోసా అవసరం
- హేయ నేరాలపై సమగ్ర చర్యల దిశగా ‿ పభుత్వం కదలిక
- సహాయమందించడంలో న్యాయ వ్యవస్థ, పోలీసుల పాత్ర కీలకం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సోషల్ మీడియా ద్వారా బాలలపై జరుగుతున్న లైంగిక దాడుల విషయంలో ఎలాంటి జాలి చూపకుండా దోషుల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. అందుకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో "నిస్సహాయకులకు అండగా – లైంగిక దాడికి గురైన పిల్లల రక్షణ మరియు హక్కులు" అన్న అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సులో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ , తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్‌తో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు.

ఈ సదస్సులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "పిల్లలపై జరుగుతున్న హేయమైన నేరాలను నియంత్రించడమే కాకుండా బాధితులకు చట్టపరంగా, నైతిక పరంగా మాత్రమే కాకుండా అన్ని రకాలుగా రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది. బాలికలు, మహిళలకు రక్షణ కల్పించడంలో తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుంది. వారి రక్షణ కోసం తెలంగాణలో భరోసా ప్రాజెక్టును చేపట్టాం. భరోసా ప్రాజెక్టు కింద ప్రస్తుతం 29 కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఈ కేంద్రాల ద్వారా బాధితులకు పోలీసు సహకారమే కాకుండా న్యాయపరమైన, వైద్యపరమైన సహాయం అందించడంతో పాటు సానుకూల వాతావరణంలో వారికి అవసరమైన కౌన్సెలింగ్ వంటి సేవలను అందిస్తున్నాయి. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న భరోసా కేంద్రం ద్వారా చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టులను ప్రారంభించిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ ఉంది. ఈ కోర్టుల ద్వారా కేసులను సత్వరం పరిష్కరించడమే కాకుండా పిల్లలకు సంపూర్ణ రక్షణ, వారిలో విశ్వాసం కల్పించడం, భవిష్యత్తులో వారి అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్న లక్ష్యంతో వీటిని ప్రారంభించాం.

పోక్సో చట్టం , జువెనైల్ చట్టాల ఆచరణలో ఎదురవుతున్న సమస్యలను అధిగమించాలి. ఆ చట్టాలు బాధితులకు ఎలాంటి వేదన కలిగించకుండా, వారి భవిష్యత్తుకు రక్షణగా సంపూర్ణ సహాయకారిగా ఉండాలి. న్యాయం కేవలం కోర్టుల్లోనే లభించాలనే కాకుండా, ఈ ప్రక్రియలో ప్రతి దశలోనూ వారికి అవసరమైన అండదండలు లభించాలి. పోలీస్ స్టేషన్, బాలల సంక్షేమ కేంద్రాలతో పాటు అన్ని దశల్లోనూ మిగితా 4వ పేజీలో

# రోజుకు 10 గంటల పని

**వాణిజ్య కేంద్రాల్లో ఉద్యోగులు రోజుకు 10 గంటల వరకు పని చేసేందుకు అనుమతి ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

వాణిజ్య కేంద్రాల్లో ఉద్యోగుల పని వేళల పరిమితిని తెలంగాణ ప్రభుత్వం సవరించింది. రోజుకు 10 గంటల వరకు పని చేసేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వారంలో పని వేళలు 48 గంటలు మించరాదని స్పష్టం చేసింది. పరిమితి దాటితే ఓటీ వేతనం చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. రోజులో 6 గంటల్లో కనీసం అరగంట విశ్రాంతి ఇవ్వాలని, విశ్రాంతితో కలిపి 12 గంటల కంటే ఎక్కువ పని చేయించరాదని ఆదేశించింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా పని వేళలు సవరించినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

## బాధిత చిన్నారుల పట్ల వ్యవస్థ సున్నితంగా వ్యవహరించాలి

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



లైంగిక వేధింపుల బాధిత చిన్నారుల పట్ల వ్యవస్థ మరింత సున్నితంగా వ్యవహరించాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. న్యాయం చేసే క్రమంలో పిల్లల మానసిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈ విషయంలో న్యాయవ్యవస్థతో సహా భాగస్వాములైన ప్రతి విభాగం, అధికారులు సున్నితంగా కేసులను పరిష్కరించడంలో మరింత అవగాహన పెంచుకోవాల్సిన అవసరముందని ఆయన అభిప్రాయ పడ్డారు. రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ, మహిళా భద్రతా విభాగం, యునిసెఫ్, తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సంయుక్తాధ్వర్యంలో హైదరాబాద్‌లో "నోరు లేని వారి గొంతుక – లైంగిక వేధింపులకు గురైన చిన్నారుల హక్కులు, భద్రత"పై సంబంధిత భాగస్వాముల సంప్రదింపుల రాష్ట్రస్థాయి సమావే శాలు –2025 ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమ ప్రారంభోత్సవానికి శనివారం జస్టిస్ సూర్యకాంత్ ముఖ్యఅతిథిగా హాజరు కాగా సీఎం రేవంత్ రెడ్డి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్, డీజీపీ జితేందర్, యునిసెఫ్ ఇండియా ప్రతినిధి సింథియా మెక్ కాఫ్రే పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్యకాంత్ మాట్లాడుతూ లైంగిక వేధింపుల బారిన పడినవారు రకరకాల మానసిక రుగ్మతల బారిన పడే అవకాశాలెక్కువనీ, డిప్రెషన్‌కు గురై కొన్ని సందర్భాల్లో ఆత్మహత్యలు కూడా చేసుకుంటారని అన్నారు. వారికి పునరావాసం కల్పించడం ముఖ్యమని గుర్తుచేశారు. కోర్టు నాలుగు గోడల మధ్య భద్రంగా ఉన్నామని భావిస్తే సరిపోదనీ, ఆ గోడల ఆవల భద్రతకు భరోసా ఉందనే పరిస్థితులు రావాలని ఆకాంక్షించారు. పిల్లల భద్రత అందరి సమిష్టి బాధ్యత అని తెలిపారు. వారిని కాపాడు కోలేకపోతే దేశం తన ఆత్మను కోల్పోయినట్టేనని వ్యాఖ్యానించారు. పిల్లలను నిర్లక్ష్యం చేస్తే దేశ భవిష్యత్తును కోల్పోతామని హెచ్చరించారు.

# సవాల్‌కు సై



- రైతులకు ఎవరు ఏం చేశారో చర్చిద్దామన్న రేవంత్ రెడ్డి ఛాలెంజ్‌ను స్వీకరిస్తున్నా
- 72 గంటల్లో రా.. తేల్చుకుందాం
- 8న ఉదయం 11 గంటలకు సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో చర్చకు సిద్ధం
- కేసీఆర్ పాలనలో వచ్చిన రైతు రాజ్యాన్ని ప్రజలు మరిచిపోలేరు
- బీజేపీ పాలిత మహారాష్ట్రలో 3 గంటలకో రైతు బలవన్మరణం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**


రైతుల విషయంలో ఎవరు ఏం చేశారన్న అంశంపై సీఎం రేవంత్ రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. ప్లేస్, డేట్, టైం రేవంత్ రెడ్డే నిర్ణయించుకోవాలని స్పష్టం చేశారు. రేవంత్‌కు వ్యవసాయంపై కనీస అవగాహన కూడా లేదని విమర్శించిన ఆయన, చర్చకు ముందు ప్రిపరేషన్‌కు 72 గంటల సమయం ఇస్తున్నట్టు చెప్పారు.

72 గంటల్లో రా.. తేల్చుకుందామని సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. ఈ నెల 8న ఉదయం 11 గంటలకు సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో చర్చకు సిద్ధమని చెప్పారు. చర్చకు మూడు రోజుల సమయం ఇస్తున్నామని, ప్రిపేర్ అయ్యి రావాలన్నారు. లేదంటే చర్చకు వచ్చి బేసిన్లు, బెండకాయలు అంటే ఇజ్జత్ పోతుందని ఎద్దేవా చేశారు. పార్టీ నేతలతో కలిసి తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. 'తెలంగాణలో రైతు రాజ్యం తెచ్చింది కేసీఆర్. రైతు కేంద్రంగా ప్రభుత్వాన్ని నడిపింది బీఆర్ఎస్. నిజం తెలిసినా ఒప్పుకోలేని వ్యక్తి రేవంత్ రెడ్డి. సభ పెడితే బూతులు మాట్లాడుడే రేవంత్ రెడ్డి పనిగా పెట్టుకున్నాడు. రైతు సంక్షేమంపై రేవంత్ రెడ్డి ఎక్కడ చర్చ పెట్టినా మేం రెడీ. 72 గంటలు సమయం ఇస్తున్నా.. ప్రిపేర్ అయ్యి చర్చకు రండి. రేవంత్ రెడ్డికి బేసిన్ తెలవదు, బెండకాయ తెల్వదు. దేవాదుల గోదావరి బేసిన్ లో ఉందా అని అడుగుతడు. నల్లమల పులి అంటాడు.. మళ్లీ నల్లమల తెలంగాణలోనే ఉందా అని అంటడు అన్నారు.

రైతులకు చేసే మేలుపై బీఆర్ఎస్ – కాంగ్రెస్ హయాంలో తేడా ఏంటో ప్రజలకు తెలుసని, కేసీఆర్ పాలనలో వ్యవసాయాన్ని పండుగలా మార్చామని తెలిపారు. చంద్రబాబు కోవర్టులా వ్యవహరిస్తూ రేవంత్ తెలంగాణ నీటిని ఏపీకి తరలిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు.

నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో తెలంగాణ ఉద్యమాన్ని నడిపాం. రేవంత్ రెడ్డి వచ్చాక నీళ్లను ఆంధ్రాకు, నిధులను ఢిల్లీకి పంపుతున్నారు. తన అనుచరులకు నియామకాలు ఇచ్చారు. కేసీఆర్ ప్రభుత్వం చేసినట్లు రైతులకు ఎక్కడా, ఎవరూ చేయలేదు. 70 లక్ష మంది రైతుల ఖాతాల్లో నిధులు జమచేశాం. రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుంది. రైతుకు పెట్టుబడి, ఉచిత విద్యుత్, వాగులు నిపింన ఘనత కూడా కేసీఆర్‌దే. రైతు చనిపోతే రూ.5 లక్షల బీమా ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వమే. దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో చెరువులను ధ్వంసం చేశారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులకు జీవం పోశాం. రూ.30 వేల కోట్ల విలువైన మత్స్య సంపద సృష్టించాం. రాష్ట్రాన్ని కోటి ఎకరాల మాగాణిగా మార్చింది మిగితా 4వ పేజీలో

## కొత్త స్టాంప్ విధానం రూపకల్పనకు కసరత్తు



- వచ్చే శాసనసభ సమావేశాల్లో బిల్లు
- మహిళలకు స్టాంప్ డ్యూటి తగ్గించే ఆలోచన
- పాత అపార్ట్ మెంట్‌లకు స్టాంప్ డ్యూటి వెసులుబాటు
- ముఖ్యమంత్రితో చర్చించి తుది నిర్ణయం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా సాధారణ ప్రజలకు నష్టం కలిగించకుండా వ్యాపార ఒప్పందాలపై పారదర్శకత ఉండేలా స్టాంప్ విధానాన్ని భారతీయ స్టాంపు చట్టం 1899ను అనుసరించి తెలంగాణ సవరణ బిల్లు–2025ను తీసుకురావాలని నిర్ణయించినట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఈ బిల్లును తీసుకువచ్చేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని వెల్లడించారు.

??ఈ సవరణ బిల్లుపై శనివారం నాడు డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్య కార్యదర్శి వి. శేషాద్రి, రెవెన్యూ శాఖ కార్యదర్శి డి. ఎస్. లోకేష్ కుమార్, న్యాయవ్యవహారాల కార్యదర్శి రెండ్ల తిరుపతి, స్టాంప్స్ %డ% రిజిస్ట్రేషన్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు, ముఖ్యమంత్రి కార్యాలయ ఓఎస్డి వేముల శ్రీనివాస్ తదితరులతో సమావేశం నిర్వహించారు.

??భారతీయ స్టాంపు చట్టం 1899 ప్రకారం, తెలంగాణ పరిధిలో నాలుగు సెక్షన్లను మరియు 26 ఆర్టికల్స్ ను సవరించుట కొరకు 2021 సంవత్సరంలో శాసనసభలో సవరణ బిల్లును ఆమోదించి భారత ప్రభుత్వం ఆమోదం కొరకు పంపడం జరిగిందని అయితే ఈ బిల్లుపై భారత ప్రభుత్వం వ్యక్తం చేసిన అభ్యంతరాలకు సమాధానం ఇచ్చినప్పటికీ 2023 జనవరిలో మిగితా 4వ పేజీలో



## బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రామచంద్రరావు ..

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖకు నూతన అధ్యక్షుడిగా ఎన్. రామచందర్‌రావు శనివారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా పార్టీ నేతలు, కార్యకర్తలు ఆయనను గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ, ఇతర సీనియర్ బీజేపీ నేతలు హాజరయ్యారు. ముందుగా తన నివాసం నుంచి ర్యాలీగా బయలుదేరిన రామచందర్‌రావు ఉస్మానియా యూనివర్సిటీలోని సరస్వతీ దేవాలయంలో, అనంతరం చార్మినార్ వద్ద ఉన్న భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘన స్వాగతం పలికారు. రామచందర్‌రావు నాయకత్వంలో తెలంగాణ బీజేపీ మరింత బలోపేతం కానుందని నేతలు విశ్వాసం వ్యక్తం చేశారు.

## జర్నలిస్టులను సంక్షేమ పథకాలలో భాగస్వాములు చేస్తాం



- ఐటి మంత్రి శ్రీధర్‌బాబు
- మంథని ప్రెస్‌క్లబ్‌ను సందర్శించిన మంత్రి

**బలగం టీవీ, మంథని**

ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులను ప్రభుత్వ సంక్షేమ పథకాలలో భాగస్వాములుగా చేస్తామని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. శనివారం ఆయన పెద్దపల్లి జిల్లా మంథనిలోని ప్రెస్‌క్లబ్ కార్యాలయాన్ని సందర్శించి స్థానిక పాత్రికేయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, "గత పదేళ్లలో జర్నలిస్టులు అనేక సమస్యలను ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో వారి సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుంది. ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాస్ వంటి పథకాల్లో పాత్రికేయులకు మంజూరుకు నావంతు కృషి చేస్తాను" అని హామీ ఇచ్చారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి జర్నలిస్టులు రాజకీయాలకు అతీతంగా సేవలు అందించాలని మంత్రి సూచించారు. ప్రజల అభివృద్ధిపై జర్నలిస్టుల ఆలోచనలు వార్తల రూపంలో ప్రతిబింబించాలని పిలుపునిచ్చారు. ప్రజల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని, జర్నలిస్టులు ప్రభుత్వానికి మద్దతుగా కాకుండా ప్రజల వాణిగా ఉండాలని హితవు పలికారు.

ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని, క్లబ్ భవన నిర్మాణానికి కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు (%జూక్ష్మ%) పొందేందుకు ప్రయత్నిస్తానని మంత్రి తెలిపారు. గతంలో కూడా మంథని జర్నలిస్టుల అభివృద్ధికి సహకరించానని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబును ప్రెస్‌క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఇటీవల టియుడబ్ల్యూజె జిల్లా ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన జిల్లా ఉపాధ్యక్షుడు కొమురోజు చంద్రమోహన్, కోశాధికారి తగరం రాజు, కార్యవర్గ సభ్యులు లక్కాకుల నాగరాజును మంత్రి శాలువాలతో సత్కరించారు.

## పిల్లలపై లైంగిక దాడులపై కఠినంగా వ్యవహరిస్తాం

- మంత్రి సీతక్క


**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



పిల్లలపై లైంగిక దాడుల కేసుల్లో బాధితులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా అన్ని రకాల సహాయాలను ఒకే వేదికపై అందించే గ్రీన్ ఛానల్ పద్ధతిని తెలంగాణ ప్రభుత్వం అమలు చేయబోతోందని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఎంసీఆర్హెచ్‌ఆర్డి లో జరిగిన రాష్ట్రస్థాయి సదస్సులో 'లైంగిక నేరాల నుంచి బాలల సంరక్షణ' అంశంపై జరిగిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, జడ్జిలు, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పిల్లలపై లైంగిక దాడులకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకుంటున్నామనీ, గంటల వ్యవధిలోనే నిందితులను అరెస్ట్ చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. "90 శాతం కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకున్నాం. బాధితులకు న్యాయ, వైద్య సహాయం, కౌన్సిలింగ్ వంటి సేవలు అందిస్తున్నాం," అని మంత్రి వివరించారు.

గంజాయి, మత్తు పదార్థాల వినియోగం వల్లే ఎక్కువ లైంగిక దాడులు జరుగుతున్నాయని విచారణల్లో వెల్లడైనట్లు మంత్రి తెలిపారు. "తెలంగాణ ప్రభుత్వం నార్కోటిక్స్ విభాగాన్ని ఏర్పాటు చేసి, గంజాయి రవాణా, వినియోగాన్ని నియంత్రిస్తోంది," అని చెప్పారు. బాలలలో గుడ్ టచ్ – బ్యాడ్ టచ్పై అవగాహన కల్పించేందుకు అంగన్వాడి కేంద్రాల ద్వారా, మహిళా సంఘాల సహకారంతో కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఇందిరా మహిళా శక్తి పాలసీ ద్వారా మహిళల ఆర్థిక, సామాజిక స్థాయిని పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, భవిష్యత్‌లో దీనిలో చిన్నారుల రక్షణ అంశాన్ని కూడా చేర్చే విషయాన్ని పరిశీలిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థ, పోలీస్ శాఖ, బాలల సంక్షేమ సంస్థలు సమిష్టిగా పనిచేసి, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని మంత్రి సూచించారు.



## కేసీఆర్ డిశ్చార్జి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

స్వల్ప అస్వస్థత కారణంగా యశోద దవాఖానాలో చికిత్స పొందిన మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) శనివారం డిశ్చార్జి అయ్యారు. గురువారం వైద్యుల సలహా మేరకు ఆసుపత్రిలో చేరిన కేసీఆర్ రెండు రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉండి సాధారణ వైద్య పరీక్షలు పూర్తయ్యాక ఆసుపత్రి నుంచి విడుదల అయ్యారు. వైద్యులు వెల్లడించిన వివరాల ప్రకారం, కేసీఆర్ ఆరోగ్యం సాధారణంగానే ఉందని, శరీరంలో సోడియం స్థాయులు కొద్దిగా పెరిగినట్టు తేలింది. ఇకపై ఆయన ఒక వారం రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుందని వైద్యులు సూచించారు. ఆ తర్వాత మరోసారి కొన్ని వైద్య పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు.

ఈ నేపథ్యంలో రానున్న గురువారం లేదా శుక్రవారం రోజుల్లో కేసీఆర్ యశోద ఆసుపత్రికి మరోసారి వెళతారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. వైద్య పరీక్షల నడుమా విరామ సమయంలో కూడా ఆయన పార్టీ సీనియర్ నేతలతో చర్చలు జరుపుతున్నారని సమాచారం. రాష్ట్రంలో సాగునీరు, వ్యవసాయం, రైతుల సంక్షేమం తదితర ప్రజా సమస్యలపై సమీక్షలు నిర్వహిస్తూ, అవసరమైన సూచనలు అందిస్తున్నట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# మహిళ సాధికారతలో తెలంగాణ రోల్ మోడల్..



బలగం టీవీ, హైదరాబాద్

'మహిళ సాధికారతను లక్ష్యంగా పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తున్నాయి. ప్రజా ప్రభుత్వంగా మహిళల ఆర్థిక, సామాజిక ఉన్నతికి ప్రాధాన్యత ఇస్తూ, వాటిని కార్యరూపం దిద్దుతోంది' అని తెలంగాణా డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. తమ ప్రభుత్వం మహిళా సంఘాలకు అండగా ఉంటుందన్నారు అవకాశం ఉన్న ప్రతిచోటా మహిళలకు ఆర్థిక భరోసా ఇస్తామని అన్నారు. ప్రజాభవన్ లో ఇందిరా మహిళా శక్తి సంబరాలు నిర్వహించారు. ఆర్టిసికి అద్దె బస్సులు అందించిన మహిళా సంఘాలకు చెక్కులను మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భట్టి మాటాడుతూ.. వ్యాపారం చేసుకునే మహిళలను ప్రోత్సహిస్తున్నామని, కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలనే లక్ష్యంతో ముందుకెళు _న్నామని తెలియజేశారు. ఐదేళ్లలో మహిళలకు రూ. లక్ష రుణాలు ఇవ్వాలనేది లక్ష్యమని, మహిళలకు తమ ప్రభుత్వం కల్పిస్తున్న లబ్ది గురించి చర్చించాలని అన్నారు. గ్రామాలు, మండలాల్లో మహిళా సమాఖ్య సమావేశాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ నెల 10 నుంచి 16 వరకు అసెంబ్లీ నియోజక వర్గాల్లో సమావేశాలు జరగనున్నాయని చెప్పారు. వడ్డీ లేని రుణాల నగదును చెక్కుల రూపంలో అందిస్తామని, ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంపై ప్రజలకు వివరించాలి అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

"ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా జూలై 12వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా వడ్డీ లేని రుణాల పంపిణీ ప్రారంభమవుతోంది. లక్ష్యం. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడం. మొదటి ఏడాదిలోనే రూ. 21,000 కోట్ల రుణాలను పంపిణీ చేయడం ద్వారా మహిళా సంఘాలకు శక్తినివ్వడం జరుగుతోంది. ప్రతి సంవత్సరం కనీసం రూ. 20,000 కోట్ల వరకు అందించాలని ప్రభుత్వం సంకల్పించుకుంది' అని అన్నారు.

'ఆర్టీసీతో భాగస్వామ్యంలో మహిళా సంఘాలు బస్సులను కొనుగోలు చేసి అద్దెకు ఇచ్చి స్థిర ఆదాయం పొందుతున్నాయి. విద్యుత్ శాఖతో ఒప్పందం ద్వారా మహిళా సంఘాలచే సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నారు. పాఠశాలలు, క్యాంటీన్లు, స్కూల్ యూనిఫామ్‌ల తయారీ వంటి ప్రభుత్వ పనులు మహిళలకే అప్పగిస్తూ ఉపాధిని కల్పిస్తున్నారు. మహిళలను మహారాణులుగా గౌరవిస్తూ, వారికి స్వయం ఉపాధి మార్గాలను అందిస్తూ, తెలంగాణ ప్రభుత్వం చరిత్రాత్మక మార్గంలో ముందుకెళ్తోంది' అని అన్నారు.

# 'డిజిటల్ అరెస్ట్' పేరుతో మరో మోసం

● వృద్ధుడిని లక్షల రూపాయలు మోసం చేసిన సైబర్ నేరగాళ్లు

బలగం టీవీ, హైదరాబాద్



నగరంలో సైబర్ నేరగాళ్లు మరోసారి తమ దుర్మార్గపు బాటలో నడిచారు. 'డిజిటల్ అరెస్ట్' పేరుతో కొత్త తరహా మోసం చేసి, అమీర్‌పేటకు చెందిన 77 ఏళ్ల వృద్ధుడి నుంచి రూ.53 లక్షల వరకు కాజేశారు. బాధితుడి ఫిర్యాదుతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. గత నెల 18న గుర్తు తెలియని నంబర్ నుంచి వచ్చిన కాల్ ఓ పెనుభయానికి నాంది పలికింది. కాల్ చేసిన వ్యక్తి తనను ఢిల్లీ డీసీపీ రాజీవ్ కుమార్‌గా పరిచయం చేసుకొని, బాధితుడిపై మనీలాండరింగ్ కేసు నమోదైందని తెలిపాడు. అరెస్టు వారెంట్ జారీ అయ్యిందని బెదిరించాడు. దీంతో ఆందోళనకు గురైన వృద్ధుడిని మాయలో పడేసేందుకు, బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ చేయాలన్న సుప్రీంకోర్టు ఆదేశాల నకిలీ కాపీని వీడియో కాల్‌లో చూపించాడు.

ఈ పరిణామాలతో భయంతో గులాబీ అయిన బాధితుడు, తనపై కేసు నమోదు చేయవద్దని వేడుకున్నాడు. నేరగాళ్లు ఇదే అవకాశంగా మాయమాటలు చెప్పి, "మీ ఖాతాలో ఉన్న డబ్బులు మేము చెప్పిన ఖాతాలకు బదిలీ చేస్తే, వాటిని పరిశీలించి తిరిగి జమ చేస్తాం" అంటూ నమ్మబలికారు. వారి మాటలపై నమ్మకముంచిన వృద్ధుడు, విడతల వారీగా రూ. 53 లక్షలు మోసగాళ్లు చెప్పిన ఖాతాలకు బదిలీ చేశాడు. డబ్బులు అందుకున్న వెంటనే వారు వీడియో కాల్‌ను కట్ చేసి, ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారు. ఎంత ప్రయత్నించినా స్పందన లేకపోవడంతో మోసపోయిన విషయాన్ని గ్రహించిన బాధితుడు వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, నేరగాళ్లను గుర్తించేందుకు దర్యాప్తు ప్రారంభించారు. ప్రజలు ఇటువంటి మోసాలకు లక్ష్యంగా మారకుండా జాగ్రత్తగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

# అరుణాచల గిరి ప్రదక్షిణకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

బలగం టీవీ, హైదరాబాద్

గురుపౌర్ణమి సందర్భాన్ని పురస్కరించుకుని తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదక్షిణకు భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందన్న నేపథ్యంలో, హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సుల ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్టీసీ ప్రకటించింది. భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్ రెండో డిపో ద్వారా ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నట్లు డిపో మేనేజర్ వెల్లడించారు.

**బస్సు వివరాలు:**

బయలుదేరు తేదీ: జూలై 9
ప్రయాణ ప్రారంభం: రాత్రి 7 గంటలకు, దిల్‌సుఖ్‌నగర్ నుంచి
గమ్యస్థానం: అరుణాచలం
మార్గం: కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా
తిరిగి బయలుదేరు: జూలై 11 మధ్యాహ్నం అరుణాచలం నుంచి
హైదరాబాద్ చేరిక: జూలై 12 ఉదయం 6 గంటలకు
టికెట్ ఛార్జీ: ఒక్కరికి రూ.3900

**బుకింగ్ వివరాలు:**

బస్సు టికెట్ రిజర్వేషన్ కోసం
ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్: www.tgsrtcbus.in లేదా దగ్గరలోని ఏటీబీ ఏజెంట్లను సంప్రదించవచ్చు.

సమాచారం కోసం సంప్రదించవలసిన నంబర్లు: 9959444165, 9346559649, 9666350995, 7382838010, 9959226249

భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, సౌకర్యవంతమైన ప్రయాణం కోసం ముందుగానే టికెట్లు బుక్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

# అమెరికా టెక్సాస్‌లో భారీ వర్షాలు

**24 మంది మృతి, 30 బాలికలు గల్లంతు**

బలగం టీవీ, హైదరాబాద్

అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రాన్ని భారీ వర్షాలు ముంచెత్తాయి. వరుసగా కురుస్తున్న వర్షాల ప్రభావంతో నదులు ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. గ్వాడాలుపే నదిలో వరద ప్రవాహం ఉధృతంగా ఉండటంతో రాష్ట్రంలోని పలుచోట్ల తీవ్ర ప్రకృతి విపత్తుగా మారింది. ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటివరకు 24 మంది మరణించినట్లు, 30 మంది బాలికలు గల్లంతైనట్లు అధికారులు ప్రాథమికంగా వెల్లడించారు. అత్యధికంగా గ్వాడాలుపే నది పరివాహక ప్రాంతాలు వృద్ధిగా ప్రభావితమయ్యాయి.

టెక్సాస్ రాష్ట్రంలోని గ్వాడాలుపే నది ఒడ్డున ఏర్పాటు చేసిన క్రిస్టియన్ క్యాంప్‌లో ఉన్న 20 నుండి 25 మంది బాలికలు వరద నీటిలో గల్లంతయ్యారు. అప్పుడు క్యాంప్ ప్రాంతాన్ని వరదలు ముంచెత్తాయి. పిల్లల జాడ తెలియకపోవడంతో వారి కుటుంబాలు తీవ్ర ఆందోళనకు లోనవుతున్నాయి.

గల్లంతైనవారికోసం పోలీసు, రెస్క్యూ బృందాలు పడవలు, హెలికాప్టర్ల సాయంతో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయి. లోతట్టు



ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమర్జెన్సీ పరిస్థితులు కొనసాగుతున్నాయి. టెక్సాస్ అధికారులు, రెడ్‌క్రాస్ సంస్థలు ప్రజలకు సహాయం అందిస్తున్నాయి. సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి, తాత్కాలిక నివాస ఏర్పాట్లు చేస్తున్నారు. గల్లంతైన బాలికల కోసం అన్వేషణ కొనసాగుతోంది.


# భర్తను హత్య చేసిన భార్య

**బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన**

బలగం టీవీ, హైదరాబాద్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. మద్యం మత్తులో వచ్చి తరచూ వేధింపులకు గురిచేస్తున్నాడనే కారణంతో ఓ భార్య, భర్తను గొంతు నులిమి హత్య చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహబూబ్‌నగర్ జిల్లా రామకృష్ణయ్యపల్లికి చెందిన అంజిలప్ప, రాధ అనే మహిళతో 2014లో వివాహం చేసుకున్నాడు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారు గతంలో ముంబై, అనంతరం మణికొండలో నివసించి, ఇటీవల మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నిజాంపేట వద్ద ఓ భవన నిర్మాణ సంస్థలో కార్మికులుగా చేరారు. అక్కడే గుడిసెలో నివసిస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే, అంజిలప్ప మద్యం పానం చేసి వచ్చి తరచూ భార్యపై అనుమానంతో గొడవపడేవాడని సమాచారం. ఈ వేధింపులను తట్టుకోలేకపోయిన రాధ, జూన్ 22న రాత్రి మద్యం మత్తులో ఉన్న భర్తను గొంతు నులిమి హత్య చేసింది. ఆపై ఇది సహజ మరణంగా చిత్రీకరించే ప్రయత్నం చేసింది. అంజిలప్ప మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి అంత్యక్రియల ఏర్పాట్లు చేస్తుండగా, మృతుడి బంధువులకు అనుమానం వచ్చి నారాయణపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును బాచుపల్లి పోలీసులకు బదిలీ చేశారు. దర్యాప్తులో రాధ హత్య చేసినట్లు స్పష్టత వచ్చింది. అనంతరం ఆమెను అరెస్ట్ చేసిన పోలీసులు న్యాయస్థానంలో హాజరు పరిచారు. ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపుతోంది.

# ప్రభాస్ పీఏ అని ఒకరు ఫేక్ కాల్ చేశారు



**ఫిష్ వెంకట్ కుమార్తె**

బలగం టీవీ, హైదరాబాద్

టాలీవుడ్ ప్రేక్షకులకు సుపరిచితమైన సహాయ నటుడు ఫిష్ వెంకట్ తీవ్ర అనారోగ్యంతో పోరాటం చేస్తున్నారు. రెండు కిడ్నీలు పూర్తిగా పని చేయకపోవడంతో, ప్రస్తుతం ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఈ క్రమంలో యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ రూ. 50 లక్షలు సాయం చేశారు అన్న వార్తలో ఎలాంటి వాస్తవం లేదని వెంకట్ కుమార్తె స్పష్టం చేశారు.

ఆమె మాట్లాడుతూ "కొన్ని రోజుల క్రితం ఒక గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి, తాను ప్రభాస్ పర్సనల్ అసిస్టెంట్ అని చెప్పాడు. వెంకట్ ఆరోగ్య స్థితిని గురించి విచారించి, త్వరలో సాయం అందిస్తామంటూ హామీ ఇచ్చి అరగంటలో మళ్లీ కాల్ చేస్తానన్నాడు. కానీ ఆ తర్వాత ఎంతగా ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో ఈ ఒక్క ఫోన్ ఆధారంగానే "ప్రభాస్ 50 లక్షలు సాయం చేశాడు" అన్న తప్పుడు వార్తలు ప్రచారంలోకి వచ్చాయి' అని ఆవేదన వ్యక్తం చేశారు.

"ప్రభాస్ పీఏ అంటూ ఒకరు కాల్ చేసిన మాట నిజమే. కానీ ఎటువంటి ఆర్థిక సహాయం మాకు అందలేదు. మేము చెప్పకుండానే వార్తలు ఎలా రాస్తారు? ఈ ప్రచారం వల్ల మాకు నిజంగా సహాయం చేయాలనుకునే వారు కూడా వెనక్కి తగ్గే ప్రమాదం ఉంది" అంటూ ఆమె కన్నీటి పర్యంతమయ్యారు.

ఫిష్ వెంకట్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని, వైద్యులు పది రోజుల్లో కిడ్నీ మార్పిడి చేయాలని సూచించారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఒక మాజీ మంత్రి లక్ష రూపాయల సహాయం అందించగా, 'గబ్బర్ సింగ్' బృందానికి చెందిన కొంతమంది ఆసుపత్రి వద్ద సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. అయితే, 'మా' అసోసియేషన్ నుంచి గానీ, టాలీవుడ్ అగ్రహీరోల నుంచి గానీ స్పందన రాకపోవడం విచారకరం అని ఆమె అన్నారు. చిరంజీవి, పవన్ కళ్యాణ్, ప్రభాస్ వంటి ప్రముఖులు స్పందించి, తమ తండ్రిని ఆదుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కష్టసమయంలో తెలుగు సినిమా పరిశ్రమ అండగా నిలవాలని ఫిష్ వెంకట్ కుటుంబం ఆకాంక్షిస్తోంది.

# నీటి గుంటలో పడి అక్కా తమ్ముడు మృతి

బలగం టీవీ, హైదరాబాద్

ఆదిలాబాద్ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. నీటి గుంతలో ప్రమాదవశాత్తు పడి అక్క, తమ్ముడు మృతి చెందిన ఘటన శనివారం మావలలో జరిగింది . మావలకు చెందిన స్వామి కొడుకు విధాత (9), కూతురు వినూత్న (11) గ్రీన్ సిటీ సమీపంలోని సైకిల్ మీద వెళుతుండగా ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి మృతి చెందారు. వారి మృతదేహాలను నీటి కుంటలో నుంచి బయటకు తీసి రిమ్స్ మార్చురీకి తరలించారు.



## ఓటర్ల జాబితా నుండి చెన్నమనేని రమేష్ బాబు పేరు తొలగింపు..

**వారి గృహానికి నోటీసులు అతికించిన అధికారులు**

**బలగం టీవీ, వేములవాడ:**

మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు పేరును ఓటర్ల జాబితా నుండి తొలగిస్తూ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సిబ్బంది ఆయన స్వగృహానికి నోటీసులు అంటించారు. పౌరసత్వ వివాదం కేసులో ఉన్నత న్యాయస్థానం రమేష్ బాబు భారత పౌరుడు కాదని, జర్మనీ పౌరుడని నిర్ధారించిన నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నారు. ఈ విషయం గత కొన్ని రోజులుగా చర్చనీయాంశంగా ఉంది. 2009లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చెన్నమనేని రమేష్ బాబు భారత పౌరుడు కాదని, అక్రమ మార్గాల ద్వారా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకుని ఓటు హక్కు పొందారని ఆరోపించారు. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, విచారణ చేపట్టిన న్యాయస్థానం రమేష్ బాబు భారతీయ పౌరుడు కాదని, జర్మనీ పౌరుడని తీర్పు ఇచ్చింది. గతంలో 2013లో కూడా హైకోర్టు రమేష్ బాబు ఓటరు జాబితాలో అక్రమంగా తన పేరును నమోదు చేసుకున్నట్లు తీర్పు ఇచ్చింది.

## టీవీ9 రిపోర్టర్ ప్రసాద్ మృతి మీడియా రంగానికి తీరని లోటు..

**బీఆర్ఎస్ పార్టీ పట్టణ అద్యక్షులు జిందం చక్రపాణి**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

టియుడబ్ల్యూజే 143 సభ్యుడు సిరిసిల్ల నియోజకవర్గ టీవీ9 రిపోర్టర్ గర్దాస్ ప్రసాద్ (45) శనివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందడం మీడియా రంగానికి, వారి కుటుంబ సభ్యులకు తీరనిలోటు అని బీఆర్ఎస్ పార్టీ పట్టణ అద్యక్షులు జిందం చక్రపాణి అన్నారు. గర్దాస్ ప్రసాద్ గత కొన్ని సంవత్సరాలుగా మీడియా రంగంలో పనిచేస్తూ సిరిసిల్ల జిల్లాలో మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించి ప్రజలతోపాటు జిల్లాలోని అధికారులతో మంచికి మారుపేరుగా సత్సంబంధాలు కలిగి ప్రజా సమస్యలను మీడియాతో పరిష్కరిస్తూ మంచి పేరు తెచ్చుకున్నారు. అయితే దురదృష్టవశాత్తు ప్రసాద్ ఈరోజు గుండెపోటుతో మృతి చెందడంతో చాలా బాధాకరమన్నారు. స్థానిక శాసనసభ్యులు మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు పక్షాన సిరిసిల్లా పట్టణ బి.ఆర్.యస్ పార్టీ పక్షాన వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని వ్యక్తం చేస్తూ ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తున్నామన్నారు.



## టీబీ వ్యాధిపై అవగాహన కార్యక్రమం

**తేమడ నమూనాలను సేకరించి వేములవాడ ఏరియా ఎక్స్రే ల్యాబ్ కు పంపించాము**

**మెడికల్ అధికారి రేణు ప్రియ**

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం మానువాడ గ్రామంలో టీబీ వ్యాధిపై అవగాహనను టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో మెడికల్ ఆఫీసర్ రేణుప్రియా ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రత్యేక అధికారిగా ఎంపీడీవో జయశీల ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం రేణుప్రియ మాట్లాడుతూ:

టీబీ ముక్త్ భారత్ అభియాన్ నిర్వహించిన కార్యక్రమంలో బీపీ, షుగర్, ఆర్.బి.ఎస్, హెచ్ఐవి, హెచ్.బి.ఎస్.ఏ.జీ, ఆర్.డి.టి, దీర్ఘకాలిక సమస్యలకు సంబంధించిన పరీక్షలు చేశామని,96 మందిని పరీక్షించి వారిలో 20 మందికి తెమడ నమూనాలను సేకరించామని, ఏడుగురిని ఎక్స్రే కొరకు వేములవాడ ఏరియా ఆసుపత్రికి పంపించామన్నారు. అనంతరం మందులు పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ .వినుత్న ఎం.ఎల్.హెచ్.పి, ఉమారాణి ఎం.పి.హెచ్.ఎస్, కళావతి ఎం.పి.హెచ్.ఎస్, లక్ష్మమ్మ ఎం.పి.హెచ్.ఏ, వినోద ఎం.పి.హెచ్.ఎ, రమేష్ ఎం.పి.హెచ్.ఏ ఎం, శారద ఏ.ఎస్ హెచ్.ఏ, మహేంద్ర ఏ.ఎస్.హెచ్.ఎ, మంజుల ఏ.ఎస్.ఎస్.ఏ, రమేష్, గంగాధర్ ఎస్.టి.ఎస్ (టి.బి సూపర్వైజర్), మానువాడ గ్రామ కార్యదర్శి రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# నీటి సంపులో పడి బాలుడి మృతి

**బలగం టీవీ, వేములవాడ**



నీటి సంపులో పడి ఓ బాలుడు(6) మృతి చెందాడు. ఈ సంఘటన వేములవాడ మండలం చింతల్ఠన గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన లింగంపల్లి స్వప్న–రవి ఏకైక కుమారుడు లింగంపల్లి రిషీ (6) తన స్నేహితుల తో కలిసి ఇంటి సమీపంలోని కొత్తగా నిర్మాణం అవుతున్న భవనం వద్ద ఆడుకుంటున్నారు. కాగా ప్రమాదవశాత్తు రిషీ నీటి సంపులో పడిపోగా స్నేహితులు చూసి కుటుంబ సభ్యులకు తెలిపారు. కాగా వారు వచ్చి చూసే సరికి రిషీ మృతి చెంది ఉన్నాడు. రవి–స్వప్న దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు కాగా రిషీ ఒక్కడే కుమారుడు కావడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# తల్లిదండ్రుల సంరక్షణ పిల్లల బాధ్యతే

**వయో వృద్ధుల హక్కులపై పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష స్పష్టీకరణ**

**బలగం టీవీ, పెద్దపల్లి**

జన్మనిచ్చిన తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత సంతానమే భరించాల్సి ఉంటుందని, ఈ బాధ్యతను నిర్లక్ష్యం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లో వయోవృద్ధుల సంరక్షణ చట్టం%–2007 ప్రకారం విచారించిన కేసులో తీర్పును వెలువరించారు.

రామగుండం మండలంలోని ఎఫ్‌సీఐ ప్రాంతానికి చెందిన ఓ వృద్ధురాలు తన కుమారుడు తాను నివసిస్తున్న ఇంటి నుంచి బహిష్కరించేలా మానసిక వేదనకు గురిచేస్తున్నాడని, తనకు సహజసిద్ధమైన హక్కు అయిన ఆస్తిలో నివాస హక్కు నుంచి దూరం చేస్తున్నాడని కలెక్టర్‌ను ఆశ్రయించారు.



ఈ మేరకు ఆమెను భర్త నిర్మించిన ఇంటిలో తన మిగిలిన జీవితాన్ని ప్రశాంతంగా గడపేందుకు అనుమతించాలన్న అభ్యర్థనను కలెక్టర్‌కు అందజేశారు.

ఈ కేసును తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంరక్షణ మరియు పునరావాస చట్టం, 2007 సెక్షన్ 23, 21(3)(బీ) ప్రకారం స్వీకరించిన కలెక్టర్ శ్రీ హర్ష, ఇరువర్గాలకు నోటీసులు జారీ చేసి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు.

**తీర్పు వివరాలు**

అర్జీదారైన వృద్ధురాలికి భద్రత, గౌరవం, శ్రేయస్సు కోణంలో న్యాయం చేయాలనే ఉద్దేశంతో ఆమె కుమారుడు 30 రోజులలో ఇంటిని ఖాళీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇకపై ఆమెకు మళ్లీ మానసికంగా ఇబ్బందులు కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. తీర్పు అమలుకు జిల్లా సంక్షేమ అధికారి, సంబంధిత పోలీసు అధికారులను నిర్దేశించారు.

"వయోవృద్ధ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం, వేధించడం మానవీయంగానూ, చట్టపరంగానూ నేరమే. ఇటువంటి ఉదంతాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం," అని కలెక్టర్ కోయ శ్రీ హర్ష చెప్పారు.

# నాయకపు గూడెం సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి



**గిరిజన శాఖ మంత్రికి వినతి పత్రం అందజేసిన సీనియర్ నాయకుడు మహంకాళి రాజన్న**

**బలగం టీవీ, వేములవాడ**

బీర్‌పూర్ మండలంలోని కండ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని నాయకపు గూడెం ప్రాంతంలోని గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించాలని గ్రామ సీనియర్ నాయకుడు మహంకాళి రాజన్న రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి సీతక్కని కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి, నాయకపు గూడెం ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై వినతిపత్రం అందజేశారు. 'నాయకపు గూడెం కండ్లపల్లి గ్రామానికి కిలోమీటర్ దూరంలో ఉన్నా, 62 గిరిజన కుటుంబాలు గుడిసెల్లో నివసిస్తున్నాయి. రోడ్ సౌకర్యం లేకపోవడంతో రాకపోకలు ఎంతో ఇబ్బందిగా మారాయి. నిత్యావసర వస్తువులు అందుబాటులో లేక, జీవన విధానం క్లిష్టంగా మారింది' అని ఆయన వివరించారు.

పక్కా ఇండ్ల నిర్మాణం కోసం మాడల్ కాలనీ ఏర్పాటు చేయాలి, బస్సు సౌకర్యాన్ని కల్పించాలి, ఇంకా ఇతర మౌలిక సదుపాయాలను సమకూర్చాలని రాజన్న విజ్ఞప్తి చేశారు. వినతిని స్వీకరించిన మంత్రి సీతక్క, గిరిజనుల సమస్యలపై సానుకూలంగా స్పందించారు. సంబంధిత జిల్లా కలెక్టర్‌కు సమస్యలను పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

# "కమ్యూనిజాన్ని అంతం చేయలేరు"



**సిపిఐ నేత కూనంనేని సాంబశివరావు**

**బలగం టీవీ, మహబూబాబాద్**

కమ్యూనిజాన్ని అంతం చేయడం కేంద్ర హెూం మంత్రి అమిత్ షా వల్ల సాధ్యమవుతుందా? అంటూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలో జరిగిన సిపిఐ జిల్లా స్థాయి మూడవ మహాసభలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ల్ణ ఆయన మాట్లాడుతూ "మావోయిస్టులు మనవారే... మనిషి కోసమే కమ్యూనిజం. హిట్లర్ వల్లే కాలేదు, అమిత్ షా వల్ల ఏమవుతుందని" విమర్శించారు.

సిపిఐ ఎప్పటికీ ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా పని చేస్తుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజలను దూరం పెట్టి ఫాం హౌస్ పాలన వైపు వెళ్లిందని, అదే నసీబు రేపు కాంగ్రెస్‌ను కూడా వరిస్తుందని హెచ్చరించారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, విభజన చట్టంలో చేర్చిన బయ్యారం ఉక్కు పరిశ్రమ అంశం మరిచిపోవడం బాధాకరమన్నారు. నియామకాలు, నీళ్లు, నిధుల కోసం ప్రజలతో కలిసి ఉద్యమం చేస్తామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీకి మద్దతివ్వాలని ప్రజలను కోరారు. ఇది పేదల ఆకాంక్షల నెరవేరుకు అవసరమన్నారు. ఖమ్మంలో డిసెంబర్ 26న జరిగే సిపిఐ 100 ఏళ్ల వేడుకలు ఎంతో ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. నల్లు సుధాకర్ రెడ్డి, తక్కెళపల్లి శ్రీనివాసరావు, తమ్మెర విశ్వేశ్వర్‌రావు, ఉప్పలయ్య, పంజాల రమేష్, తోట భిక్షపతి తదితరులు.

## మూడో టీ20లో ఇంగ్లండ్ విజయం

బలగం టీవీ, హైదరాబాద్

: ఇంగ్లండ్‌తో హోరాహోరీ పోరులో భారత మహిళల జట్టు పోరాడి ఓడింది. శుక్రవారం జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 5 పరుగుల తేడాతో ఇంగ్లండ్ చేతిలో ఓటమిపాలైంది. ఇంగ్లిష్ జట్టు నిర్దేశించిన 172 పరుగుల లక్ష్యఛేదనలో భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 166 పరుగులు చేసింది. ఓపెనర్లు స్మృతి మంధన (56), షెఫాలీ వర్మ (47) జట్టుకు మెరుగైన శుభారంభం అందించారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 85 రన్స్ జోడించారు. విజయానికి 6 బంతుల్లో 12 పరుగులు అవసరమైన దశలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్ చివరి బంతికి ఔట్ కావడంతో భారత్ ఓటమి వైపు నిలిచింది. కాగా, ఇప్పటికే భారత్ రెండు టీ20ల్లో గెలిచింది. ఈ నెల 9న మాంచెస్టర్ వేదికగా నాలుగో టీ20 జరగనుంది.

## సిరీస్ దక్కించుకున్న భారత్ అండర్-19

### వైభవ్ సూర్యవంశీ శతకంతో చరిత్ర

బలగం టీవీ, లండన్



ఇంగ్లండ్ అండర్ 19 జట్టుతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ శనివారం జరిగిన నాలుగో యూత్ వన్డేలో భారత్ అండర్ 19 జట్టు 55 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో 4-1 తేడాతో సిరీస్‌ను భారత్ కైవసం చేసుకుంది. మాన్చెస్టర్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర శతకంతో భారత విజయానికి బాటలు వేశాడు.

ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ అండర్ 19 జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 363 పరుగులు చేసింది. వైభవ్ సూర్యవంశీ 78 బంతుల్లో 13 ఫోర్లు, 10 సిక్సులతో 143 పరుగులు చేయగా, విహాన్ మల్హోత్రా 129 పరుగులు (121 బంతుల్లో) చేసి రాణించాడు. ఈ ఇద్దరూ రెండో వికెట్‌కు 219 పరుగుల భాగస్వామ్యం నమోదు చేశారు. 363 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ అండర్ 19 జట్టు 45.3 ఓవర్లలో 308 పరుగులకు ఆలౌట్ అయింది. రాకీ ఫ్లింటాఫ్ (107), డాకిన్స్ (67), జోసెఫ్ మూర్స్ (52) ప్రయత్నించినా విజయం దూరంగా ఉండిపోయింది. భారత్ బౌలర్లలో నమన్ పుష్పక్ 3 వికెట్లు తీశాడు.

ఈ మ్యాచ్‌లో 52 బంతుల్లో శతకం సాధించిన వైభవ్ సూర్యవంశీ, యూత్ వన్డేల్లో అత్యంత వేగంగా సెంచరీ సాధించిన ఆటగాడిగా నిలిచాడు. ఇప్పటి వరకు ఈ రికార్డు పాకిస్థాన్ ఆటగాడు క్రమాన్ గులామ్ పేరిట ఉండగా, 2013లో 53 బంతుల్లో శతకం సాధించాడు. ఈసారి వైభవ్ 12 ఏళ్ల రికార్డును చెరిపేశాడు. నాలుగు మ్యాచ్‌ల్లో వైభవ్ అద్భుత ప్రదర్శనతో భారత జట్టు విజయానికి మెయిన్ పిలర్‌గా నిలిచాడు.

## బాలికలు, మహిళలకు రక్షణకు అత్యంత ప్రాధాన్యత

(మొదటి పేజీ తరువాయి)

బాధితులకు న్యాయం దక్కాలి, రక్షణ కల్పించాలి.న్యాయం దక్కడం అంటే కేవలం దోషులకు శిక్షలు విధించడం వరకే సరిపోదు. బాధితుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలి. వారికి అవసరమైన రక్షణ, సమాజంలో తగిన గౌరవం కల్పించేలా చర్యలు ఉండాలి. వారి బాల్యాన్ని తిరిగి పొందేలా చర్యలు ఉండాలి.అత్యంత హేయమైన ఇలాంటి నేరాలను నియంత్రించడంలో న్యాయమూర్తులు, పోలీసు అధికారులు, బాలల సంక్షేమ కమిటీలు, పౌర సమాజంలోని ఇతర భాగస్వామ్య సభ్యులందరం కలిసికట్టుగా ముందుకు సాగుదాం.జరిగిన అన్యాయంపై తమ గొంతు వినిపించలేని వారికి అండగా నిలవాలన్న ఇతివృత్తంతో ఈ సదస్సును నిర్వహించడం ఎంతో అవసరం. అందుకు న్యాయ వ్యవస్థ సభ్యులు, పోలీసు అధికారులు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, పౌర సమాజానికి అభినందనలు..." అని అన్నారు. ఈ ప్రారంభ సదస్సులో యునిసెఫ్ ప్రతినిధి సింథియా మెకాఫ్రే గారు, డీజీపీ జితేందర్ గారు, తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ అధికారులు, పోలీసు అధికారులు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో పాటు పౌర సమాజంలోని భాగస్వామ్య పక్షాల ప్రతినిధులు హాజరయ్యారు.

## కొత్త స్టాంప్ విధానం రూపకల్పనకు కసరత్తు

(మొదటి పేజీ తరువాయి)

భారత ప్రభుత్వం ఈ సవరణ బిల్లును రాష్ట్ర ప్రభుత్వానికి తిరిగి పంపించడం జరిగిందని ఈ సందర్భంగా అధికారులు మంత్రిగారి దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 2021లో ప్రవేశపెట్టిన సవరణ బిల్లును ఉపసంహరించుకొని ప్రస్తుత కాలానికి అనుగుణంగా 2025 సవరణ బిల్లును తీసుకురావాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. సామాన్య ప్రజలను దృష్టిలో పెట్టుకుని, నిబంధనలు కట్టుదిట్టమైన రూపంలోకి తీసుకురావడం కొత్త ఒప్పందాలకు చట్టబద్ధత కల్పించడం లక్ష్యంగా బిల్లును రూపొందించాలని అలాగే పాత చట్టంలో లేనివాటిని కొత్త చట్టం పరిధిలోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. వచ్చే శాసనసభ సమావేశాల్లో ఈ సవరణ బిల్లును ప్రవేశపెట్టాలని సూచించారు. సామాన్య మధ్యతరగతి ప్రజానీకంపై ఎలాంటి భారం పడకుండా ప్రస్తుత మార్కెట్ విలువలకు అనుగుణంగా భూముల ధరలను సవరించాలని ఇందుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

ఎలాంటి విమర్శలకు తావులేకుండా శాస్త్రీయ పద్ధతిలో భూముల ధరల సవరణ జరగాలన్నారు. ఏఏ ప్రాంతాల్లో ఎక్కువ వ్యత్యాసం ఉంది అక్కడ హేతుబద్ధంగా ఎంత శాతం పెంచేందుకు అవకాశం ఉంది తదితర అంశాలపై లోతైన అధ్యయనం చేయాలని సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వం మహిళాభ్యుదయం కోసం ఎన్నో చర్యలు చేపడతోందని దీనిలో భాగంగా మహిళలకు స్టాంప్ డ్యూటీ తగ్గించాలన్న ఆలోచన చేస్తున్నామని అలాగే కొత్త, పాత అపార్ట్‌మెంట్ లకు స్టాంప్ డ్యూటీ ఒకే విధంగా ఉందని పాత అపార్ట్ మెంట్లకు రిజిస్ట్రేషన్ తేదీలను పరిగణనలోకి తీసుకొని స్టాంప్ డ్యూటీ తగ్గించాలన్న ఆలోచన చేస్తున్నామని ఈ రెండు అంశాలపై గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారితో చర్చించి విధివిధానాలపై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు.

# 7 వికెట్ల దూరంలో...

- భారత్ 427/6 వద్ద డిక్లేర్
- ఇంగ్లండ్ ముందు 608 పరుగుల భారీ లక్ష్యం
- నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ 72/3




బలగం టీవీ, హైదరాబాద్

ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్ట్‌లో టీమిండియా విజయం దిశగా ముందుకెళ్తోంది. 608 పరుగుల భారీ లక్ష్యంతో నాల్గో రోజు ఆటలో బ్యాటింగ్ ప్రారంభించిన ఇంగ్లండ్ జట్టు.. ఆట ముగిసే సమయానికి 3 వికెట్లు కోల్పోయి 72 పరుగులు చేసింది. దీంతో చివరి రోజు భారత విజయానికి కేవలం 7 వికెట్లు మాత్రమే అవసరమవుతుండగా, ఇంగ్లండ్‌కి గెలవాలంటే ఇంకా 536 పరుగులు చేయాల్సి ఉంది.

నాలుగు రోజు ఆటలో ఆకాశ్ దీప్ (2/36), మహ్మద్ సిరాజ్ (1/29) ధాటిగా బౌలింగ్ చేస్తూ ఇంగ్లండ్ టాప్ ఆర్డర్‌ను దెబ్బతీశారు. బెన్ డకెట్ (25), జాక్ క్రాలీ (0), జో రూట్ (6) అట్టడుగు స్కోర్లకే పెవిలియన్ చేరారు. క్రీజులో ఓలీ పోప్ (24 నాటౌట్), హ్యారీ బ్రూక్ (15 నాటౌట్) కొనసాగుతున్నారు.

### భారత్ రెండో ఇన్నింగ్స్ డిక్లరేషన్

64/1 ఓవర్‌నైట్ స్కోర్‌తో నాలుగో రోజు ఆట ప్రారంభించిన భారత్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (161), కేఎల్ రాహుల్ (55), రిషభ్ పంత్ (65), రవీంద్ర జడేజా (69) అర్ధశతకాలతో రాణించడంతో రెండో ఇన్నింగ్స్‌ను 427/6 వద్ద డిక్లేర్ చేసింది. ఇంగ్లండ్ బౌలర్లలో జోష్ టంగ్ (2/93), షోయబ్ బషీర్ (2/119) మంచి ప్రదర్శన కనబరిచారు.

మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 587 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. అనంతరం ఇంగ్లండ్ 407 పరుగులకు ఆలౌట్ అయింది. ఫలితంగా భారత్‌కు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంగా 180 పరుగులు లభించాయి. ఆదివారం చివరి రోజు. ఇంగ్లండ్‌కు ఓటమి తప్పించుకోవాలంటే 90 ఓవర్ల పాటు క్రీజులో నిలవాల్సి ఉంటుంది. పిచ్ పై పగుళ్ల పెరగడం, స్పిన్నర్లకు అనుకూల పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉండటంతో భారత్‌కు విజయం దగ్గరగా కనిపిస్తోంది.

## డెంగ్యూ, ప్లేట్‌లెట్స్ పేరుతో దోపిడీకి పాల్పడితే కఠిన చర్యలు

బలగం టీవీ, హైదరాబాద్

సీజనల్ వ్యాధుల నియంత్రణకు కృషి చేయాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ఉన్నతాధికారులకు సూచించారు. డెంగ్యూ, ప్లేట్‌లెట్స్ పేరుతో ప్రయివేట్ ఆస్పత్రుల్లో దోపిడీకి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు ఆయా ఆస్పత్రులపై నిఘా పెట్టాలని ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లో ఆయన సీజనల్ వ్యాధుల నివారణ, నియంత్రణపై సమీక్షించారు. రాష్ట్రంలో వర్షాకాలం ప్రారంభం కావడంతో వాతావరణంలో మార్పులొచ్చాయనీ, దీంతో ఈ ఏడాది మే, జూన్ నుంచే అక్కడక్కడా సీజనల్ వ్యాధులు మొదలయ్యాయని అధికారులు మంత్రికి వివరించారు. గతేడాదితో పోలిస్తే ఈసారి చాలా జిల్లాల్లో డెంగ్యూ కేసులు తక్కువగా నమోదయ్యాయనీ,అయితే గ్రేటర్ హైదరాబాద్‌లో స్వల్పంగా కేసులు పెరిగాయని తెలిపారు. 19 జిల్లాల్లో పది కంటే తక్కువ కేసులు నమోదవగా, మిగిలిన జిల్లాల్లో పదికంటే ఎక్కువ కేసులు నమోదయ్యాయని అన్నారు. గతేడాదితో పోలిస్తే టైఫాయిడ్ కేసులు కూడా చాలా తక్కువగా నమోదయ్యాయన్నారు.

కేసులు ఎక్కువగా నమోదవుతున్న జిల్లాల్లో, గ్రేటర్ హైదరాబాద్‌లో యాంటిలార్వల్ ఆపరేషన్‌ను విస్తృతం చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆయా వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉన్న జీహెచ్ఎంసీ జోన్లకు స్పెషల్ ఆఫీసర్లను నియమించాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణపై కలెక్టర్లతో సమీక్షించాలని హెల్త్ సెక్రెటరీకి మంత్రి సూచించారు. ట్రైబల్ ఏరియాలపై ఎక్కువగా ఫోకస్ పెట్టాలనీ, ఐటీడీఏ పీవోలతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో పనిచేసే వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేసి, ప్రజలకు అవగాహన కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కేసులు ఎక్కు వగా నమోదవుతున్న జిల్లాల్లో ఆరోగ్యశాఖ ఉన్నతా ధికారులు పర్యటించాలని మంత్రి ఆదేశించారు. సీజనల్ వ్యాధుల బారిన పడిన పేషెంట్లకు చికిత్స అందించేందుకు హాస్పిటళ్లలో అవసరమైన అన్ని వసతులతో సిద్ధంగా ఉండాలని అధికారులను కోరారు. అన్ని ఆస్పత్రుల్లో అవసరమైన అన్ని రకాల ఔషధాలను అందుబాటులో ఉంచుకోవాలని మంత్రి సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రతి సోమవారం నివేదిక ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆరోగ్యశాఖ రూపొందించిన కరపత్రాలను ఈ సందర్భంగా మంత్రి ఆవిష్కరించారు. ఇండ్లను పరిశుభ్రంగా ఉంచుకున్నట్టే, ఇంటి పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇంట్లో, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. ఒకవేళ సీజనల్ వ్యాధుల బారినపడితే, ప్రభుత్వ ఆస్పత్రుల వైద్య సేవలను ఉపయోగించుకోవాలనీ, అక్కడ అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

## సవాల్‌కు సై

(మొదటి పేజీ తరువాయి)

కేసీఆర్ కాదా?. 75 ఏండ్ల స్వాతంత్ర్యం తర్వాత వ్యవసాయ రంగానికి కేసీఆర్ చేసినంత ఎవరూ చేయలేదు. ఎరువుల పంపిణీ చేతకాని మీరు.. కేసీఆర్‌ను చర్చకు పిలుస్తారా?.

యూరియా కోసం రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఎరువులు, విత్తనాల కోసం లైన్లలో చెప్పులు పెట్టడమేనా ఇందిరమ్మ రాజ్యం అంటే. ఆసిఫాబాద్ జిల్లాలో రైతులు ఎరువుల కోసం యుద్ధాలు చేస్తున్నారు. ఆధార్ కార్డు చూపిస్తే రైతుకు ఒక బస్తా యూరియా ఇవ్వాలని ఆదేశించారు. రైతుల ఆత్మహత్యలకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చింది రేవంత్ రెడ్డి కాదా. వాగులు, వంకలు నింపిన ఘనత కేసీఆర్‌ది. బోనస్ ఇవ్వకుండా ఎగ్గొట్టిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిది. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా కేసీఆర్ రైతు బీమా తీసుకొచ్చారు. ఆ రైతు బీమాను ఎగ్గొట్టింది రేవంత్ రెడ్డి కాదా?. కేసీఆర్ దేశంలోనే తెలంగాణను నంబర్ వన్ రాష్ట్రంగా మార్చారు. కిందికి నీళ్లను తీసుకెళ్తుంటే కాంగ్రెస్ పార్టీ నాయకులు హారతులు పట్టారు. గోదావరి, కృష్ణా నీటిని ఒడిసిపట్టి కోటి ఎకరాల మాగాణం చేసింది కేసీఆర్ కాదా?. ఇదంతా తెలంగాణ రైతాంగానికి తెలియదా. మీ గురువు చంద్రబాబు బనకచర్ల ద్వారా నీళ్ల దోపిడీకి పాల్పడుతున్నాడు. చంద్రబాబుకు వత్తాసు పలుకుతున్నదెవరో ప్రజలకు తెలియదా. నల్లగొండ జిల్లాను ఫ్లోరైడ్ నుంచి విముక్తి కల్పించింది కేసీఆర్ కాదా. రెండు దఫాలుగా కేసీఆర్ రైతు రుణమాఫీ చేశారు. కరోనా, నోట్ల రద్దును తట్టుకుని రూ.34 వేల కోట్ల రుణమాఫీ చేశారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ఒక్కటైనా అమలు చేశారా. ఒకేసారి రుణమాఫీ చేస్తామని చెప్పారు.. చేశారా?. రేవంత్ రెడ్డి ఎక్కడ చర్చకు రావాలో ప్లేస్, డేట్ చెప్పు.. నువ్వు పారిపోతే మేం టైమ్, ప్లేస్ చెబుతున్నాం.. చర్చకు రా. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 8 తారీఖునాడు చర్చకు సిద్ధం. ఉదయం 11 గంటలకు సమయం ఇస్తున్నాం. వస్తవా.. పారిపోతావో నువ్వే తేల్చుకో. నాలుగు పంటలకు రైతుభరోసా ఎగ్గొట్టి పండుగ చేసుకోమంటున్నవ్వు. రైతు భరోసాకు రూ.15 వేలు ఇస్తున్నవా?. కౌలు రైతులకు లేఖలు రాసి ఇప్పుడెందుకు పైసలు ఇస్తలేవు?. రైతు బంధులో మొత్తం రూ.39 వేల కోట్లు ఎగ్గట్టారు. మొదటి విడుతలో రూ.15 వేలు అని చెప్పి రూ.10 వేలే వేశారు. ఎన్నికల వరకే రైతుభరోసా ఇస్తాడు. తర్వాత మొత్తం బంద్ పెడుతారు. ఒక్కో రైతుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ.19 వేలు బాకీ ఉంది. రైతు రుణమాఫీ రూ.12 వేల కోట్లు మాత్రమే చేశారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వలేదు. 30 శాతం వడ్లు మాత్రమే కొనుగోలు చేశారు. కేసీఆర్ హయాంలో ప్రారంభమైన ఉద్యోగ ప్రక్రియకు అపాయింట్‌మెంట్ ఉద్యోగాలు ఇచ్చాడు. మందికి పుట్టిన బిడ్డను మా బిడ్డ అని చెప్పుకుంటున్నాడు. అశోక్ నగర్ చౌరస్తాలో రాహుల్, రేవంత్ రెడ్డి చర్చకు రావాలి. రూ.2500 కోసం కోటి 40 లక్షల మంది మహిళలు ఎదురు చూస్తున్నారు. స్కూటీల కోసం విద్యార్థినిలు ఎదురు చూస్తున్నరు. రేవంత్ రెడ్డి తెలంగాణను 'పే సీఎం.. పే ఢిల్లీ ఏటీఎంగా మార్చిండు' అని కేటీఆర్ అన్నారు.